

"కొండంత గుమ్మడి కత్తిపీటకు లోకువంటార్లే చిట్టీ!"

రత్తు చేశారు కదా."

బాత్‌రూమ్‌లో జొరబడి తలుపు దభీమని వేసుకున్నాడు.

స్నానం ముగించివచ్చి వంటగదిలో కూర్చున్నాడు ఆలోచిస్తూ. స్వీటుహార్టు పాలు తీసుకువచ్చింది.

"వద్దు. నాకు కాఫీ కావాలి."

"కాఫీ యివ్వను పాలే. ఇష్టమైతే త్రాగండి. లేకపోతే హోటలుకెళ్ళండి."

అతను లేచాడు. గబగబా షర్టు తగిలించుకున్నాడు. ట్రౌజరు వేసుకొని బయలుదేరబోతున్నాడు.

"అయితే పాలు త్రాగరన్నమాట."

అతను జవాబివ్వలేదు. "తలుపేసుకో" అన్నాడు బయటికి వెళ్ళబోతూ.

"ఏమండీ!"

వీధిలో అడుగుపెట్టాడు.

"కాఫీ త్రాగుదురు రండి" అంటూ తలుపుదగ్గరికి వచ్చింది సుజాత.

గిరుక్కున తిరిగి ఒక్కసారి కోపంగా చూచి వెళ్ళిపోయాడు.

హోటల్లో కాఫీ, టిఫిన్ చేసి (తిని) వచ్చి, టేబిలుమీద ఉన్న తాజా వార్తాపత్రిక చేతికి తీసుకొని కూర్చున్నాడు. సుజాత టిఫిన్ తీసుకొనివచ్చి ప్రతిమాలింది. 'రాక్షసీ!' అని ఛీవరించుకున్నాడు.

"ప్రేయసీ అనడం పోయి రాక్షసీ అంటారేమిటండీ" అని బుంగమూతి పెట్టి.

అతను ప్లేటు విసరికొట్టాడు. ఉప్మా చెల్లాచెదరుగా నేలమీద పడింది.

"ఏమైందండీ మీకు?" అంది విస్తుపోతూ. 'వద్దని చెబితే నేనైనా తినేసి ఉందును కదా.'

"తిను, తిను! నాకంటె డబుల్‌గా."

